సమస్యలు పట్టవా..!

ధనవంతులకు చేరువలో పేదలకు నిర్మించిన ఇళ్లు



నిరుపేదలు, బడుగు, బలహీన వర్గాలు నివసించే కాలనీలపై కూటమి ప్రభుత్వం సవతి తల్లిప్రేమ చూపిస్తుందా..? జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కావాలనే కాలయాపన చేస్తున్నారా..? నగరంలోని జీవీఎంసీ 52వ వార్డు పరిధిలోని గౌరీనగర్(రిక్షాకాలనీ) వాసుల ఎదుర్కొంటున్న ఇబ్బందులను చూసిన వారికి ఇలాంటి అనుమానాలే రేకెత్తితున్నాయి. కాలనీ వాసులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. జీవీఎంసీ కుళాయిల ద్వారా ఉదయం వేళ నీరు సరఫరా చేస్తున్నారు. కాలనీలో నివసించే వారంతే నిరుపేదలు కావడంతో కూలి పనులకు వెళ్తారు. కొంతమంది నీరు ఉండిపోతున్నారు. మరికొంత మంతి పొరుగున ఉన్న **వారికి డబ్బాల్లో నీరు పట్టమని పురమాయించాల్సిన దుస్థితి ఉంది.** – విశాఖ విద్య

- తాగునీటి కోసం అల్లాడుతున్న జనం
- మూలకు చేరిన చేతిపంపులు
- ఎన్‌ఏడీ రిక్షా కాలనీపై అధికారుల చిన్నచూపు
- జగనన్న కాలనీలపై ఎందుకీ వివక్ష

- 2019కు ముందు టీడీపీ ప్రభుత్వ హయాంలో 24 కుటుంబాల వారి కోసం ఒక బ్లాక్ నిర్మించారు. వీటిని జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చాకే పూర్తి చేశారు. అయితే, టీడీపీ ప్రభుత్వ హయాంలో పనులు చేసినప్పుడు సరైన నాణ్యత లేకపోవడంతో ప్రస్తుతం ట్యాపులన్నీ లీకై ఇళ్లల్లో అసౌకర్యంగా ఉంటుంది.
- కాలనీలో జరిగే వేడుక ఏదైనా వీధిలోనే **జరుపుకోవాలి. సమీపాన** స్థలం ఉన్నా అది **రైల్వే శాఖది కావడంతో** అటువైపు వెళ్లే పరిస్థితి **లేదు. కమ్యూనిటీ హాల్** నిర్మించడానికి ఇక్కడ **కొంత స్థలం కేటాయిం**చారు. హాల్ నిర్మాణం **కోసం జీవీఎంసీ అధి**కారులు పట్టించుకోవడం **లేదు.**

నగరం నడిబొడ్డున మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇక్కడ 60 కుటుంబాల కోసం ఇళ్లు కట్టించారు. రోజువారీ అవసరాలకు ట్యాంకు ఏర్పాటు చేసి మోటారుతో నీటితో నింపి దాని నుంచే బ్లాక్‌లోని ప్రతి ఇంటికీ ట్యాపుల ద్వారా సరఫరా చేస్తున్నారు. అయితే ఇక్కడ మరో రెండు బ్లాకుల్లో మరో 48 కుటుంబాలకు ఇళ్లు నిర్మించారు. వాటికి కూడా అదే ట్యాంకు ద్వారా నీటిని సరఫరా చేస్తుండడంతో నీటి సమస్య తలెత్తింది. దీంతో నివాసీయులే ఇంటికో రూ.50 చొప్పున పోగు చేసుకొని ట్యాంకులో నీరు అయిపోయిన వెంటనే మోటారు వేసి దాన్ని నింపేలా కాలనీలోని ఓ వ్యక్తికి బాధ్యతలు పురమాయించారు. ప్రస్తుతం ఉన్న ట్యాంకును శుభ్రం చేసే పరిస్థితి లేక వాటిని వాడితే దురదలు వస్తున్నాయని కాలనీ వాసులు అంటున్నారు.

ఎన్నెన్నో సమస్యలు

- మొదట్లో నిర్మించిన 60 కుటుంబాల వారి కోసం విద్యుత్ లైన్లు ఏర్పాటు చేశారు. రెండు బ్లాకులు మధ్య ఉన్న రెండు విద్యుత్ స్తంభాల అమర్చారు. వీటి నుంచే విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు. ఇక్కడ నివాసాలు పెరిగినా లేకుండా అదనపు విద్యుత్ లైన్లు వేయలేదు.
- కాలనీలో బ్లాకులకు ఇరువైపులా రెండు చేతి పంపులు ఉన్నాయి. ఇవి పాడైపోయి నాలుగు నెలలు కావొస్తుందని కాలనీ వాసులు తెలిపారు. కానీ, వీటిని మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు జీవీఎంసీ అధికారులు శ్రద్ధ చూపడం లేదు.



మరమ్మతులకు గురైన బోరు



కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం కేటాయించిన స్థలంలో ఆడుకుంటున్న యువకులు, బాలలు



ఈ ట్యాంకు నీరే కాలనీ వాసులకు ఆధారం

- కాలనీకు ఆనుకొని (రైల్వే ట్రాక్ వైపు) మురుగు కాలువ ఉంది. ఎన్‌ఏడీ పరిసర కాలనీల నుంచి వచ్చే డ్రైనేజీ నీరు అంతా ఇక్కడ నుంచే దిగువకు వెళ్తోంది. ఇక్కడ పారిశుద్ధ్య నిర్వహణ బాగాలేదు. దీంతో ఈ ప్రాంతంలో తీవ్ర దుర్గంధం వెదజల్లుతుంది. ఈ కారణంగా కాలనీలోని వృద్ధులు, చిన్నపిల్లలు తరచూ అనారోగ్యానికి గురవుతున్నారు. ఇక్కడ కాంపౌండ్ వాల్ కట్టేందుకు నిధులు కేటాయించినా, కూటమి నేతల కుళ్లు రాజకీయాలతో పనులు ముందుకు సాగడం లేదు.

మోటారు వేసే బాధ్యత నాదే



తాగునీరు సంగతి సరే. రోజు వారీ అవసరా**లకు** నీరు కావాలి కదా. ఈ ఒక్కమోటారు **నీళ్లే** అందరికీ సరఫరా అవుతాయి. అం**దు**కే ట్యాంకు నీళ్ల వెంట వెంటనే నింపే బాధ్యత నాకు అప్పగించారు. ఈ పని చేసినందుకు నాకు కాలనీ వాసులంతా కొంత డబ్బులు ఇస్తారు.
– బర్ల అప్పారావు

నీటి కోసం అవస్థలు

ప్రతీ రోజు ఉదయం 8గంటలకు మున్సిపాలిటీ కుళాయి నీళ్లు వస్తాయి. అప్పుడు పట్టుకుంటేనే ఇంట్లో తాగేందుకు నీళ్లు ఉండేది. పొద్దున్నే పనికిపోయేటోళ్లం. నీళ్ల కోసం చాలా ఇబ్బందులు పడుతున్నాం. సాయంత్రం పూట కూడా నీళ్ల సరఫరా చేసేలా అధికారులు మాపై కరుణించాలి.
– టి. సింహాచలం,

మా గోడు పట్టించుకోవడం లేదు



రోజువారీ పనులు చేసుకొని బతికే మాబోటోళ్లకు ఆ తండ్రీ కొడుకులు (వైఎస్ రాజశేఖర రెడ్డి, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి) ఇళ్లు కట్టించి ఇచ్చారు. సంతోషంగా ఉన్నాం. ఇప్పుడు నిర్వహణ, మౌలిక వసతులు గురించి పట్టించుకోవడం లేదు. చాలా సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాం. తాగునీళ్లు సరిపడా లేవు. కమ్యూనిటీ హాల్ కోసం స్థలం కేటాయించినా ఎవరూ పట్టించుకోవడం లేదు. మా సమస్యలు పరిష్కరించాలి. – గుడవాడ లక్ష్మి

క్లుప్తంగా

ఆదర్శప్రాయుడు అంబేడ్కర్

మల్కాపురం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆదర్శప్రాయుడు.. ఆయన ఆశయ సాధనకు నేటి యువత కృషి చేయాలని బౌద్ధ పచారుకుడు ధర్మానంద అన్నారు. 61వ వార్డు ఇండస్ట్రియల్‌కాలనీలోని బౌద్ధారామం వద్ద శుక్రవారం బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి, బుద్ధుడి విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అంబేడ్కర్ దేశానికి అందించిన సేవలను వివరించారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల అందజేత



లబ్ధిదారుకు చెక్కు అందిస్తున్న విప్ గణబాబు

గోపాలపట్నం: గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లో పలువురు లబ్ధిదారులకు శుక్రవారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను వారి ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వ విప్ గణబాబు అందించారు. గోపాలపట్నానికి చెందిన జనకల సత్యనారాయణకు రూ.1.95 లక్షలు, కొమ్ముల దుర్గాదేవికి రూ.47,142, రామలక్ష్మికి రూ.40 వేలు, లక్ష్మీనగర్‌కు చెందిన బి.కృష్ణకార్తీక్‌కు రూ.2.07 లక్షలు, వలసపల్లి అప్పన్నకు రూ.2.56 లక్షలు, బొత్స గౌరికి రూ.13,836, నరసింహనగర్‌కు చెందిన రెడ్డి పైడినాయుడుకు రూ.3.50 లక్షలు.. మొత్తంగా పది మందికి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



జేసీపీ చర్చిలో గుడ్ ఫ్రైడే సందేశమిస్తున్న మోజెస్

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని చర్చిల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. మల్కాపురం జేసీపీ అండ్ ఈఎం చర్చిలో పాస్టర్ మోజెస్ ప్రత్యేక ప్రార్థనలు చేసి ప్రసంగించారు. శాంతి స్థాపనకు ఏసు క్రీస్తు భూమిపైకి వచ్చారన్నారు. గుడ్ ఫ్రైడే రోజున శిలువ రక్తం ద్వారా మానవుల పాపాలను విమోచించారన్నారు. చర్చి సభ్యులు పాల్గొన్నారు.

24న మెగా జాబ్‌మేళా

గోపాలపట్నం: ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24న నిర్వహించనున్న మెగా జాబ్ మేళా పోస్టర్‌ను ప్రభుత్వ విప్ గణబాబు శుక్రవారం గోపాలపట్నం క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ, గోపాలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరగనున్న ఈ మెగా జాబ్ మేళాలో పలు ప్రముఖ ఐటీ కంపెనీలు, ఫార్మాస్యూటికల్ కంపెనీలు, మార్కెటింగ్, ట్రాన్స్‌పోర్ట్ , హాస్పిటల్ రంగానికి చెందిన దాదాపు 53 కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. ఇంటర్వ్యూల అనంతరం ఎంపికై న అభ్యర్థులకు అక్కడికక్కడే నియామక పత్రాలు అందజేస్తారని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

జాతీయ బాక్సింగ్ పోటీలకు పరవాడ విద్యార్థి



జాతీయ స్థాయి బాక్సింగ్ పోటిలకు ఎంపికైన విద్యార్థి హరిన్

పరవాడ: పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలకు చెందిన విద్యార్థి ఎస్.ఎం. హరిన్ జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 30న ఢిల్లీలో ఈ పోటీలు జరగనున్నాయని పాఠశాల ప్రిన్సిపల్ ఎస్.సీతాలక్ష్మి తెలిపారు. గత ఏడాది అక్టోబరులో మచిలీపట్నంలో స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో హరిన్ పాల్గొని స్వర్ణ పతకం సాధించాడు. ఈ విజయంతో అతడు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థి హరిన్, కోచ్ అమర్నాథ్, పాఠశాల ఉపాధ్యాయురాలు అన్నపూర్ణలను చైర్మన్ పి.సూర్యనారాయణరెడ్డి అభినందించారు.

రేపు చిత్రలేఖనం పోటీలు

మర్రిపాలెం: ధరిత్రి దినోత్సవం సందర్భంగా ఈ నెల 20న చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు కాలుష్య నియంత్రణ మండలి రీజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ముకుందరావు తెలిపారు. మాధవధారలోని కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో శుక్రవారం ఆయన వివరాలు వెల్లడించారు. 7వ తరగతి వరకు జూనియర్లుగా, ఇంటర్ వరకు విద్యార్థులను సీనియర్లుగా పరిగణిస్తామన్నారు.

ఇంద్రకాలనీలో కార్డన్ సెర్చ్



వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ రవికుమార్



వాహనాల రికార్డులు పరిశీలిస్తున్న ఎస్ఐ నజీర్

అక్కిరెడ్డిపాలెం: గాజువాక పోలీస్ స్టేషన్ పరిధి 66వ వార్డు ఇంద్రకాలనీలో గాజువాక పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. శుక్రవారం గాజువాక ఎస్ఐలు టి.రవికుమార్, నజీర్‌ల సారథ్యంలో సుమారు 25 మంది సిబ్బంది కార్డన్ సెర్చ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతీ ఇంట్లో కుటుంబ సభ్యుల గుర్తింపు కార్డులను పరిశీలించారు. అనుమానిత వ్యక్తుల వివరాలను స్థానికుల నుంచి అడిగి తెలుసుకున్నారు. గంజాయి, మత్తు పదార్థాలు, మద్యం నిల్వలు ఉన్నాయోమనని పరిశీలించారు. ఐదు వాహనాల రికార్డులు సరిగా లేకపోవడంతో వాటిని సీజ్ చేశారు. తర్వాత యజమానులు రికార్డులను ఎస్ఐలకు సమర్పించడంతో యజమానులకు అప్పగించారు.

హోటల్‌లో ఉత్కంఠ



ప్రమాదంలో చిక్కుకున్న వారిని తీసుకువస్తున్న అగ్నిమాపక సిబ్బంది..



అగ్నిప్రమాదం జరిగినప్పుడు నీటిని స్ప్రింక్లింగ్ చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అల్లిపురం: సమయం ఉదయం 10.30 గంటలు.. సరస్వతి జంక్షన్, అల్లిపురం నుంచి ప్రజలు హఠాత్తుగా డాల్ఫిన్ హోటల్ వైపు పరుగులు తీశారు. అక్కడ ఏం జరుగుతుందో అర్థం కాక అందరూ ఆందోళనగా హోటల్‌లోకి చేరుకున్నారు. అక్కడ స్కై లిఫ్ట్‌లో కొందరు వ్యక్తులను రక్షిస్తుండటం చూసి ఉత్కంఠకు గురయ్యారు. అయితే అక్కడ అగ్నిమాపక శాఖ సిబ్బంది నిర్వహిస్తున్న మాక్‌డ్రిల్ అని తెలియడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. జిల్లా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం డాల్ఫిన్ హోటల్‌లో అగ్నిమాపక సిబ్బంది ప్రత్యేక విన్యాసాలు నిర్వహించారు. ప్రాంతీయ అగ్నిమాపక అధికారి నిరంజన్‌రెడ్డి పర్యవేక్షణలో హోటళ్లలో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను స్కై లిఫ్ట్ సహాయంతో ఎలా సురక్షితంగా రక్షించవచ్చో ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. రక్షణ చర్యలను సిబ్బంది వివరించారు.

దైవమంటే లెక్క లేదు..!

- మల్కాపురంలో దేవుని చిత్రాల శిలాఫలకం వద్ద వ్యర్థాల పారబోత



జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం హనుమాన్ ఆలయం వెనుక గల సర్వీస్ రోడ్డులో కొందరు స్థానికులు తమ ఇళ్లలోని వ్యర్థాలను నిర్లక్ష్యంగా పడేస్తున్నారు. దీంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే వారు ఇబ్బంది పడుతున్నారు. పారిశుధ్య కార్మికులు రోజూ వీధుల్లోకి వచ్చి వ్యర్థాలను సేకరిస్తున్నప్పటికీ సర్వీస్ రోడ్డులో కొందరు చెత్తను డంప్ చేస్తూ పరిసరాలను అధ్వానంగా మారుస్తున్నారు. మల్కాపురం పల్లి వీధి సర్వీస్ రోడ్డులో చెత్త వేయకూడదని దేవుని చిత్రాల శిలాఫలకం నెలకొల్పినా.. అక్కడ వ్యర్థాలను నిర్లక్ష్యంగా పడేస్తున్న వారి తీరులో మార్పు రావడం లేదు. దైవమంటే తమకు లెక్కే లేదన్నట్లుగా ప్రవర్తిస్తున్నారు. ఇంటింటికీ వచ్చే శానిటరీ సిబ్బందికి చెత్తను ఇవ్వకుండా.. ఇలా సర్వీస్ రోడ్డులో, దేవుళ్ల చిత్ర ఫలకాల వద్ద పడేస్తుండటంతో మల్కాపురం ప్రాంత కీర్తి దిగజారుతోందని పలువురు అంటున్నారు.
- మల్కాపురం

మేమంతా వైఎస్సార్‌సీపీతోనే..

- నాయకులు మారినా మేము మారం
- ప్రయోజనాలు పొంది కష్టకాలంలో పార్టీకి వెన్నుపోటు
- బెహరా తీరుపై 91, 92 వార్డుల కార్యకర్తల మండిపాటు

గోపాలపట్నం: మేమంతా వైఎస్సార్‌సీపీలోనే ఉంటాం.. వ్యాపారాల కోసం.. డబ్బులకు లొంగిపోయి కన్నతల్లి లాంటి వైఎస్సార్‌సీపీకి కీలక సమయంలో వెన్నుపోటు పొడిచిన వారు భవిష్యత్తులో దారుణ పరిస్థితి ఎదుర్కొంటారని జీవీఎంసీ 91, 92 వార్డుల కార్యకర్తలు చెబుతున్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు బెహరా భాస్కరరావు జనసేనలో చేరడంపై తీవ్రంగా మండి పడుతున్నారు. తన వ్యాపారాలు నిలబెట్టు కోవడం కోసం , నమ్మిన జనాలను, వారి నమ్మకాలను తాకట్టు పెట్టడం దారుణమంటున్నారు. జీవీఎంసీ 91, 92 వార్డుల కార్పొరేట్ సీట్లు ఆయన కుటుంబ సభ్యులకే ఇచ్చారని గుర్తు చేస్తున్నారు. అలాగే కో ఆప్షన్ సభ్యుడిగా పదవి ఇచ్చి గౌరవించినా సంతృప్తినివ్వలేదని చెప్పడం సమంజసం కాదంటున్నారు.

వ్యాపారాల కోసమే..!

ఆయన వ్యాపారాలు దెబ్బతీసేందుకు కూటమి నాయకులు ప్రయత్నాలు చేస్తుండడం వల్లే పార్టీ మారారని కింది స్థాయి కార్యకర్తలు చెబుతున్నారు. మేయర్‌పై అవిశ్వాస తీర్మానంలో కూటమి బలం పెంచుకోవడానికి ఎత్తుగడలో భాగంగా ఆయన పార్టీ మారారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.వ్యాపారాలు నడుపుకోవడం కోసం, ఇబ్బందులు తప్పించుకోవడం కోసం కార్పొరేటర్ పదవులను ఆయన అమ్ముకున్నాడని దుయ్యబడుతున్నారు.

మాకొద్దు బాబూ అన్నా.. చేరిక!

కూటమి అధికారంలోకి రాగానే బెహరా గోడ దూకడానికి చేసిన ప్రయత్నాలను అప్పట్లో జనసేన నాయకులు అడ్డుకున్నారు. పశ్చిమ నియోజకవర్గంలో పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు బెహరా పార్టీలోకి రావద్దు అంటూ ప్లకార్డులు ప్రదర్శించిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు.

నాయకులు మారినా ..

నాయకులు పోయినా తామంతా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉంటామని కార్యకర్తలు స్పష్టం చేస్తున్నారు. రెండు వార్డుల్లో మేము పార్టీనే నమ్ముకుని ఉన్నామని.. పార్టీ కోసం పని చేస్తామని చెబుతున్నారు.

పార్టీ వీడాల్సిన అవసరం లేదు



పార్టీని నమ్మి ఉన్నాం. తాత్కాలిక ప్రయోజనాల కోసం గౌరవం ఇచ్చిన పార్టీని బెహరా భాస్కరరావు వీడి వెళ్లాల్సిన అవసరం లేదు. నాయకులు మారినా మేము మారం. చాలా దారుణమైన నిర్ణయం తీసుకున్నారు. జీర్ణించుకోలేక పోతున్నాం.
– సాలాపు మారయ్య, పద్మనాభనగర్, 92వ వార్డు

పార్టీకి అన్యాయం చేశారు



పార్టీ కోసం చాలా కష్టపడ్డాం. కార్పొరేషన్ ఎన్నికల్లో 91వ వార్డులో గెలుపుకోసం చాలా కృషి చేశాం. మా కష్టం అంతా ఇక్కడ అమ్ముడుపోయింది. చివరి క్షణంలో బెహరా ఇలా పార్టీ మారడం చాలా బాధనిపిస్తోంది. రాజకీయాలు ఇంత నీచమా..?. – చుక్కా పైడిరాజురెడ్డి, చిన బుచ్చిరాజుపాలెం, 91వ వార్డు

మా నమ్మకాన్ని అమ్మేశారు



ఆయన స్వార్థం కోసం మా నమ్మకాన్ని తాకట్టు పెట్టేశారు. పార్టీ ఆయనకు పెద్దపీట వేసింది. ఆయన మాత్రం అన్యాయమే చేశారు. అయినా మేము మాత్రం పార్టీ కోసం జగనన్న కోసం వైఎస్సార్‌సీపీలో ఉండి పని చేస్తాం.
– ఉషారాణి, పాతగోపాలపట్నం, 91వ వార్డు

ఇది నమ్మక ద్రోహమే



నమ్మకంగా ఉండి పదవులు పొంది కష్ట కాలంలో పార్టీ మారడం నమ్మక ద్రోహమే. స్వార్థ ప్రయోజనాల కోసం కార్యకర్తలను ఏమార్చడం చాలా దారుణం.
– యర్ర గంగాజు, పద్మనాభనగర్, 92వ వార్డు

నాయకులు వచ్చి పోతుంటారు



పశ్చిమ నియోజక వర్గంలో నాయకులు వస్తుంటారు... పోతుంటారు... కాని మేము మాత్రం పార్టీ కోసం పని చేస్తుంటాం. మేము మారం.. మా విధానాలు మారవు. నియోజకవర్గంలో ఇప్పటి వరకూ ముగ్గురు సమన్వయకర్తలు మారారు. మేము మారలేదు. ఇపుడు బెహరా భాస్కరరావు మారినంత మాత్రన పార్టీకి ఇబ్బంది లేదు. ఇక్కడి కార్యకర్తలు జగన్ వెంటే ఉన్నారు. – గొర్లె అప్పలస్వామి నాయుడు, పార్టీ 92వ వార్డు అధ్యక్షుడు

మత్స్యకారుల ఎన్యుమరేషన్ పూర్తి

మహారాణిపేట: చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఇచ్చే వేట నిషేధ భృతి కోసం శుక్రవారం ఎన్యుమరేషన్ పూర్తి చేశారు. జిల్లాలోని 15 ఫిష్ ల్యాండింగ్ కేంద్రాల్లో మత్స్యశాఖ జేడీ ఎ.చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది, సచివాలయ ఫిషరీస్ కార్యదర్శులు, సాగర మిత్రాలు సర్వే నిర్వహించారు. ఈ గణనలో అన్ని రకాలకు చెందిన మొత్తం 1,197 బోట్లను, 12వేల మంది మత్స్యకారుల వివరాలు నమోదు చేశారు. బోట్లకు, మత్స్యకారులకు ఫొటోలు తీశారు.

కనకమహాలక్ష్మి దేవస్థానానికి సింహాచలం ఏఈవో బదిలీ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ఏఈవోగా విధులు నిర్వర్తిస్తున్న కె.రాజేంద్రకుమార్‌ని నగరంలోని కనకమహాలక్ష్మి దేవస్థానానికి తిరిగి పంపిస్తూ రాష్ట్ర దేవదాయశాఖ ఇన్‌చార్జి కమిషనర్ కె.రామచంద్రమోహన్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. చందనోత్సవం ముందు ఈ వ్యవహారం జరగడం దేవస్థానంలో చర్చకు దారి తీసింది. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ఏఈవోగా విధులు నిర్వర్తిస్తున్న రాజేంద్రకుమార్‌ను మూడేళ్ల క్రితం జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా విజయవాడ దేవస్థానానికి బదిలీ చేశారు. కొన్నిరోజులకు మెడికల్ పర్పస్‌పై రాజేంద్రకుమార్ నగరంలోని కనకమహాలక్ష్మి దేవస్థానానికి డిప్యుటేషన్‌పై వచ్చారు. మళ్లీ కొన్ని రోజులకు రాజేంద్రకుమార్ వర్క్ ఎరేంజ్‌మెంట్ బేస్‌లో కనకమహాలక్ష్మి దేవస్థానం నుంచి సింహాచలం దేవస్థానానికి వచ్చారు. దీంతో రాజేంద్రకుమార్‌ని తిరిగి కనకమహాలక్ష్మి దేవస్థానానికి ఏఈవోగా పంపిస్తూ ఇన్‌చార్జి కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా చందనోత్సవం ముందు ఈవ్యవహారం జరగడం దేవస్థానం వర్గాల్లో చర్చకు దారితీసింది. ఏఈవోగా విధులు నిర్వర్తిస్తున్న రాజేంద్రకుమార్ భూపరిరక్షణ విభాగం బాధ్యతలు కూడా నిర్వర్తిస్తున్నారు. భూముల వ్యవహారంలో ఆయన పనితీరుతో అనుసరిస్తున్న వ్యవహారశైలి కూడా బదిలీకి ఒక కారణంగా చెప్పుకుంటున్నారు.